

వరదరాజస్వామి దేవాలయంలో నిర్మించిన త్రికలశ గోపురాలు



ఆలయ నిర్మాణంపై మ్యాప్‌ను పరిశీలిస్తున్న గులాబీ అధినేత కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి (ఫైల్)

## తెలంగాణ కంచికి

### 450 ఏండ్ల చరిత్ర కలిగిన ఆలయం

# పూర్వ వైభవం

- రూ.10 కోట్లతో కొనసాగుతున్న వరదరాజస్వామి ఆలయ పునరుజ్జీవ పనులు
- ఆలయ నిర్మాణానికి గులాబీ అధినేత కేసీఆర్ ప్రత్యేక కృషి
- రూ.2.31 కోట్లతో హనుమాన్, పెద్దమ్మతల్లి, వరదరాజస్వామి ఆలయ ముఖద్వారం

గజ్వేల్, డిసెంబర్ 27: తెలంగాణ కంచిగా పేరుగాంచిన వరదరాజస్వామి దేవాలయం పూర్వ వైభవానికి నోచుకుంటున్నది. గజ్వేల్ నియోజకవర్గంలోని మర్కూక్ మండలం వర్ధరాజ్‌పూర్ గ్రామంలోని వరద రాజస్వామి దేవాలయానికి సుమారు 450 ఏండ్ల చరిత్ర ఉంది. గులాబీ అధినేత కేసీఆర్ కృషితో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో ఆలయాల పునరుజ్జీవ పనులకు నిధులు మంజూరీ చేశారు. ఆయన కృషితో నేడు ఆలయాలు పూర్వవైభవాన్ని సంతరించుకుంటున్నాయి. ఎంతో ప్రత్యేకత కలిగిన ఆలయాన్ని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సందర్శించడంతో ఆలయానికి మహర్దశ పట్టింది. ఆలయ నిర్మాణ పనులు చేసేందుకు రూ.10 కోట్లు మంజూరు చేయడంతో గతేడాది నుంచి పనులు చకచకా కొనసాగుతున్నాయి. వందల ఏండ్ల నాటి ఆలయ చరిత్ర కలిగిన వరదరాజస్వామి దేవాలయం త్వరలోనే తెలంగాణ కంచిగా పూర్వవైభవాన్ని సంతరించుకోనున్నది.

### కేసీఆర్ సందర్శనతో పూర్వ వైభవం

కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ ప్రారంభోత్సవం రోజున వరద రాజస్వామి ఆలయాన్ని అప్పటి సీఎం కేసీఆర్ దర్శించారు. ఆలయానికి పూర్వవైభవం తీసుకురావాలని సంకల్పించి, అప్పట్లో నిర్మాణ పనులకు రూ.10 కోట్లు మంజూరుచేశారు. గ్రామాభివృద్ధికి మరో రూ.10 కోట్లు అదనంగా మంజూరు చేశారు. దీంతో వరదరాజస్వామి ఆలయ గోపురం, ముఖద్వారానికి రూ.70 లక్షలు, ఆలయంలోని హనుమాన్ ఆలయ నిర్మాణానికి రూ.80 లక్షలు, పెద్దమ్మతల్లి ఆలయానికి రూ.81.50 లక్షలు అప్పట్లో ప్రభుత్వం మంజూరు చేసింది. కంచిలోని వరదరాజస్వామి ఆలయాన్ని ఆర్‌అండ్‌బీ అధికారులు పరిశీలించిన తరువాత కంచి ఆలయానికి దీటుగా నిర్మిస్తున్నారు. ఆలయ పనులు ప్రస్తుతం యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయి.

### అద్భుతంగా నిర్మాణ పనులు

వరదరాజస్వామి ఆలయానికి గతంలో ఉన్న త్రికలశ గోపురం మాదిరిగానే ప్రస్తుత డిజైన్‌ను రూపొందించి పనులు చేపడుతున్నారు. గోపురం నుంచి స్వామివారి రథం వచ్చిపోయేలా అత్యద్భుతంగా డిజైన్‌చేసి పనులను చేయిస్తున్నారు. గోపురంలో వరదస్వామి ప్రతిమలు, శ్రీభూనీల అమ్మవారి ప్రతిమలు రానున్నాయి. ఈ పనులు వడివడిగా కొనసాగుతున్నాయి. వరదరాజస్వామి ఆలయాన్ని పూర్వ త్రికలశ గాలిగోపురాలతో నిర్మించి, ఆలయ ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆలయంలోని బంగారుబల్లి, తొండలను భక్తులు దర్శించుకుని తమ పాపాలు తొలిగించాలని కోరుకుంటారు. 450 ఏండ్ల కిందట రాతికట్టడాలతో నిర్మాణమైన ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో పనులు చేపట్టేందుకు అప్పట్లో కేసీఆర్ ముఖ్యమంత్రి హోదాలో ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు మంజూరుచేశారు. ప్రస్తుతం ఆయల పనులను పూర్తిస్థాయిలో రాతికట్టడంతో చేపడుతున్నారు. ఆలయ గర్భగుడికి కొత్త రూపం సంతరించుకునేలా నిర్మిస్తుండగా గోడలకు సహజ సిద్ధమైన రాతితో తాపడాన్ని చేస్తున్నారు. ఆలయ గోపురం సిమెంట్‌తో నిర్మించగా పీఠం, ఉప పీఠం, స్తంభవర్గం, సహజ సిద్ధమైన పనులను రాతితో తాపడాన్ని చేస్తున్నారు. త్రికలశ గాలిగోపురాన్ని యథావిధిగా నిర్మించారు. అధ్యయన మండపం, హోమశాలలు నిర్మిస్తున్నారు. పంచలోహ సమేత ధ్వజపీఠం యథావిధిగా ప్రతిష్ఠించనున్నారు. స్వామికి ద్వార పాలకులైన జయ, విజయలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటి వరకు సగానికిపైగా పనులు పూర్తయ్యాయి. అందులోభాగంగా చేపట్టిన పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. హనుమాన్ ఆలయ పనులు తుదిదశకు చేరుకున్నాయి.



వరదరాజస్వామి ఆలయాన్ని సందర్శించిన గులాబీ అధినేత కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి(ఫైల్)



నిర్మాణంలో ఉన్న వరదరాజస్వామి ఆలయం



నిర్మాణంలో హనుమాన్ ఆలయం



ఆలయం ఎదుట నిర్మించిన గోపురం



మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీఎంవో కార్యదర్శి భూపాల్‌రెడ్డి, ఈఎన్సీ రవీందర్‌రావు, కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్, వంటేరు ప్రతాప్‌రెడ్డి (ఫైల్)



త్రికలశ గోపురం

### త్వరితగతిన నిర్మాణ పనులు



ఇప్పటివరకు 50 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. ఆగమశాస్త్రం ప్రకారం పనులు చేపడుతున్నాం. త్వరలో భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తాం. ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లుతున్నాం. అప్పటి సీఎం కేసీఆర్ సూచనలతోనే నిర్మాణ పనులు ప్రారంభించాం.

\- రవీందర్‌రావు, ఆర్‌అండ్‌బీ, ఈఎన్సీ

---

## సమగ్ర విచారణ తర్వాతే పథకాల అమలు

### ఆరు గ్యారంటీలు

# పారదర్శకంగా అమలు చేస్తాం

- ప్రజాపాలన ద్వారా డాటా సేకరణ
- రైతుభరోసా, కౌలు రైతులపై సీఎం రేవంత్ నిర్ణయం తీసుకుంటారు
- బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు పూర్తి చేస్తాం
- రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి కొండా సురేఖ
- ఆరు గ్యారెంటీలు పారదర్శకంగా అమలుచేయాలి
- ఆర్టీసీ బస్సుల్లేక ఇబ్బందులు పడుతున్న మహిళలు
- ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, సునీతారెడ్డి

సంగారెడ్డి, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను గుడ్డిగా అమలు చేయదని రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి కొండా సురేఖ అన్నారు. కౌలు రైతులకు సైతం గుడ్డిగా డబ్బులు ఇవ్వమని, సమగ్ర విచారణ తర్వాతే రైతుభరోసా వర్తింపుపై సీఎం రేవంత్ నిర్ణయం తీసుకుంటారని అన్నారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజాపాలన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆరు గ్యారంటీల అమలుకోసం ప్రజాపాలన ద్వారా డాటా సేకరిస్తున్నామన్నారు. వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా విచారించిన తర్వాత ఆరు గ్యారంటీల అమలుపై ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేస్తుందన్నారు. ప్రభుత్వం జారీ చేసి మార్గదర్శకాలకు అనుగుణంగా ఆరు గ్యారంటీలను లబ్ధిదారులకు వర్తింపజేస్తామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన మంచి కార్యక్రమాలను తమ ప్రభుత్వం కొనసాగిస్తుందన్నారు. రైతు బంధు పథకం అమలుపై గతంలో మాజీ సీఎం కేసీఆర్ తన అభిప్రాయం కొరితే ఐదు నుంచి పది ఎకర్లాలోపు రైతులకు పథకం వర్తింపజేయాలని సూచించినట్లు చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్ మాత్రం అందరికీ రైతుబంధు వర్తింపజేయాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. తెలంగాణ ఉద్యమకారులు తమ పేరిట నమోదైన కేసులు, జైలులో ఉన్న వివరాలు తెలుపాలన్నారు. వాటి ఆధారంగా అర్హులైన వారిని గుర్తించి ఇంటి స్థలం అందజేస్తామన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో గురువారం నుంచి ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా దరఖాస్తులు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొత్తరేషన్ కార్డుల కోసం దరఖాస్తులు తీసుకోనున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నామన్నారు.



ఆరు గ్యారంటీల అమలు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కొండా సురేఖ, ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

### ప్రొటోకాల్ అమలుచేయడంలేదు: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు

ఉమ్మడి మెదక్ జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రొటోకాల్ పాటించడం లేదని, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నట్లు ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతారెడ్డి, చింతా ప్రభాకర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజాపాలన సన్నాహక సమావేశంలో పాల్గొన్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ ఇటీవల తన నియోజకవర్గంలో అధికారులు ప్రొటోకాల్ పాటించలేదన్నారు. ఈ విషయంలో అధికారులకు సరైన ఆదేశాలివ్వాలని మంత్రి కోరారు. కొత్త రేషన్‌కార్డుల కోసం అందరి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. ఒకే రేషన్‌కార్డుపై వేర్వేరు పథకాల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందో లేదో తెలియక ప్రజలు అయోమయానికి గురవుతున్నారన్నారు. రైతుభరోసా పథకం ప్రభుత్వం ఎప్పటి నుంచి అమలు చేస్తుందో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గంలో ప్రజాపాలన ఫ్లెక్సీలపై ఎమ్మెల్యేల ఫొటోలు వేయడంలేదన్నారు. ఆరు గ్యారంటీలను పారదర్శకంగా అర్హులైన వారందరికీ అమలుచేయాలని డిమాండ్ చేశారు. పూర్తయిన డబుల్ బెడ్రూమ్ ఇండ్లను అర్హులకు కేటాయించాలన్నారు.

### రైతుభరోసా అమలుపై స్పష్టత

రైతుభరోసా అమలుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను పారదర్శకంగా అమలు చేయాలన్నారు. ప్రజాపాలనలో అందరి నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. సరైన సంఖ్యలో బస్సులు లేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అద్దె బస్సులు నడపకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నట్లు తెలిపారు. ఆర్టీసీ సిబ్బంది మహిళా ప్రయాణికులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని, ఇది సరైంది కాదన్నారు. దీనిపై మంత్రి కొండాసురేఖ మాట్లాడుతూ కొత్తరేషన్ కార్డులతో పాటు ఆరు గ్యారంటీలపై అందరి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఒకే రేషన్‌కార్డుపై వేర్వేరు పథకాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రొటోకాల్ సమస్యలు తలెత్తకుండా చూస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కక్ష సాధింపులు, వివక్షకు తావులేదని అర్హులైనవారందరికీ పథకాలు వర్తింపజేస్తామన్నారు. ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులపై దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునీతారెడ్డి, కొత్త ప్రభాకర్, మాణిక్‌రావు, సంజీవరెడ్డి, ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, రఘోత్తం, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జడ్పీచైర్‌పర్సన్లు మంజుశ్రీజైపాల్‌రెడ్డి, రోజాశర్మ, హేమలత, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్పీ రూపేశ్, మెదక్ అదనపు కలెక్టర్ రమేశ్, అదనపు ఎస్పీ మహేందర్, సిద్దిపేట అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అదనపు ఎస్పీ సురేందర్‌రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

---

## టీఎస్ఐఐసీకి తొమ్మిదెకరాల భూమి కేటాయింపు

- ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు
- 2016లో కేటాయించిన అధికారులు
- కోర్టు తీర్పుతో పోలీసుల పహారాలో భూమి చదును

జిన్నారం, డిసెంబర్ 27: మండలంలోని గడ్డపోతారం పంచాయతీలోని సర్వేనంబర్ 27 ఉన్న 9 ఎకరాల ప్రభుత్వ భూమిని టీఎస్ఐఐసీకి కేటాయిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. బుధవారం ఈ భూమిని టీఎస్ఐఐసీకి కేటాయించేందుకు తహసీల్దార్ రవికుమార్, టీఎస్ఐఐసీ మేనేజర్ అండ్ కమిషనర్ సూరజ్ అల్లీనగర్ గ్రామ శివారులోని సర్వేనంబర్ 27కు పోలీస్ బలగాలతో కలిసి చేరుకున్నారు. 2016లో ఈ భూమి కోసం హైకోర్టును ఆశ్రయించిన రైతులు, ఇప్పటికీ ఆ భూముల్లో పంటలు వేస్తున్నామని, ఇవి తమ భూములని అధికారులను అడ్డుకున్నారు. తహసీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ సర్వేనంబర్ 27లో గతంలో 39 ఎకరాల్లో పంటలకు బదులు ఇటుక బట్టీలు పెట్టుకోవాలని ఈ భూమిని అసైన్డ్‌దారులకు అధికారులు కేటాయించారని, 2009లోనే 20 ఎకరాలు లావణి పట్టాను రద్దు చేసి ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నదని తెలిపారు. ఇందులోంచి 9 ఎకరాలను 2016లో టీఎస్ఐఐసీకి కేటాయించగా రైతులు హైకోర్టును ఆశ్రయించారని, ఏడేండ్ల తరువాత హైకోర్టు టీఎస్ఐఐసీకి కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చిందని గడ్డపోతారం, అల్లీనగర్ రైతులు, ప్రజలకు తహసీల్దార్ తెలిపారు. భూములకు సంబంధించిన కాగితాలు, సర్టిఫికెట్లు ఉంటే తీసుకురావాలని, కోర్టును కూడా ఆశ్రయించవచ్చన్నారు. తహసీల్దార్ చెప్పిన వివరణకు సంతృప్తి చెందని రైతులు ఆందోళనకు దిగారు. పోలీసులు నచ్చజెప్పినా వినలేదు. దీంతో పోలీసుల పహారాలో టీఎస్ఐఐసీకి కేటాయించిన 9 ఎకరాల భూమిని జేసీబీలు, ట్రాక్టర్లతో చదునుచేశారు. కోర్టు ఉత్తర్వులు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని రైతులకు పటాన్‌చెరు ఇన్‌చార్జి డీఎస్పీ బాలాజీ తెలిపారు. తమ భూముల్లో చదును చేయొద్దని ఆందోళనకు దిగిన పదిహేను మంది రైతులు, నాయకులను పోలీసులు అరెస్టు చేసి బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొద్ది సేపటి తరువాత వదిలేశారు. ఘటనా స్థలానికి సర్పంచ్ ప్రకాశ్‌చారి, ఉప సర్పంచ్ మమత పెంటేశ్, మాజీ సర్పంచ్‌లు అశోక్, నీరుడి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ బాశెట్టి రాజు, వార్డు సభ్యులు, రైతులు, గ్రామస్తులు భారీగా చేరుకున్నారు. రాత్రి వరకు చదును పనులు జరిగాయి.



పోలీసుల పహారాలో టీఎస్ఐఐసీ కేటాయించిన భూమిని చదునుచేస్తున్న దృశ్యం



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రవికుమార్

---

# మంచు దుప్పటి



చిన్నశంకరంపేటలో...



న్యాల్‌కల్‌లో లైట్లు వేసుకుని వస్తున్న వాహనదారులు

బుధవారం తెల్లవారుజామున నుంచి ఉదయం 9.30 వరకు పొగమంచు కప్పేసింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పొగమంచు కారణంగా రోడ్డు మార్గంలో ప్రయాణించే వాహనదారులు హెడ్ లైట్లు వేసుకుని తమ వాహనాలను నడిపారు. ఉదయం 9 గంటలు కావొస్తున్నా భానుడు కనబడలేదు. పొగ మంచుతో రోడ్డు సరిగా కనిపించకపోవడంతో కొంతమంది వాహనాలను రోడ్డు పక్కకు నిలిపివేశారు. పంట పొలాల్లో పొగమంచు కమ్మేయడంతో తెల్లటి మంచు దుప్పటి కప్పేసినట్లు తలపించింది.


\- న్యూస్‌నెట్‌వర్క్, మెదక్/ సంగారెడ్డి జిల్లా, డిసెంబర్ 26



కోహీర్‌లో..



చేగుంటలో లైట్లు వేసుకుని వస్తున్న వాహనాలు



నిజాంపేటలో ..